# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

FEB - 2011

సంవత్సర చందా రూ: 50/-

# సంక్షిప్త వార్తలు

2011 జనువరి 3వ తేదీ సోమవారం అనపర్తిమండలం జి.దొంతమూరులో యున్న స్థానిక క్రీస్తుసంఘము నిర్మించిన నూతన ఆలయమును సోదరులు జాషువాగారు ప్రార్ధనచేసి రిబ్బనుకత్తిరించి ప్రతిష్టచేసిరి. ఈ ఆలయప్రతిష్ట కార్యక్రమమునకు స్థానిక సంఘస్థులు,గ్రామస్థులు వందలాదిగా వచ్చిదానిలోపాల్గొనిరి. తదుపరి నూతన ఆలయములో జరిగిన కూటములో సోదరులు ఏరన్‌ఫాక్స్ గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్యచేసిరి. సోదరులు వి.సుదర్షన రావుగారు (రాజుమండ్రి),యన్.ప్రసాద్ గారు కూడ వాక్యపరిచర్యచేసిరి.ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి.జి.దొంతమూరులో సోదరులు సుగుణరావ్ గారు అనేక సంవత్సరములనుండి సువార్త చాటుచు క్రీస్తు కొరకు మంచి ఫలితములు సాధించుచున్నారు.ఆయన ఉపాధ్యాయునిగా పనిచేయుచు సువార్త చాటుచున్నారు.నూతన ఆలయనిర్మాణములో సోదరులు సుగుణరావ్‌గారు అనేక శోధనలు,అవంతములను ఎదుర్కొనవలసివచ్చెను.అయిననుఆయనమంచివిజయము సాధించారు. ఆలయ ప్రతిష్టనాడు హాజరైనవారందరికి మంచి విందు ఏర్పాటు చేయబడెను.

2011 జనువరి 10వ తేదీ సోమవారం నుండి 12వ తేదీ బుధవారం రాత్రివరకు కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో గొప్ప బైబిల్ లెక్చర్‌షిప్ జరిగెను.అమెరికా నుండి వచ్చిన సోదరులు వాలీకెర్బీ,మేత్యూజోన్స్,డిలాన్‌కూపర్,రేమేఫుల్స్ గార్లు చక్కని వాక్యపరిచర్యచేసిరి.వారి ఆంగ్ల ప్రసంగములను సోదరులు ఎ.సత్యవర్ధన రావ్,జాషువా గూటం గార్లు తెలుగునకనువదించిరి. రిక్కీ గూటంగారు కూడ అనుదినం చక్కటి వాక్యోపదేశ మును ఆంగ్లములో బోధించగా సోదరులు సత్యవర్ధన రావ్‌గారు తెలుగునకనువదించిరి.సోదరులు వి.సుదర్షనరావు గారు స్థానిక సంఘాలకు,బోధకులకు ఉపయుక్తమైన మంచి పాఠములను దేవుని గ్రంధమునుండి బోధించిరి.హాజరైన వందలాదిమంది చక్కని సహావానమును,భోజనవసతి సౌకర్యములను అస్వాదించిరి.లెక్చర్‌షిప్ అంతటిని రిక్కీగూటం గారు స్వయంగా పర్యవేక్షిస్తు సమర్ధవంతముగా నడిపించిరి.తదుపరి విదేశసహోదరులను పలు పట్టణములకు,పల్లెలకు పరిచయం చేస్తు వాక్యపరిచర్య చేస్తు,ప్రజలనుక్రీస్తులోనికి చేర్చుచు రిక్కీగారు శ్రమించిరి.లెక్చర్‌షిప్ సమయంలో 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 ఫిబ్రవరి - 2011 సంచిక - 7


## దేవుని వాక్యమును చదువుట కుపకరించుము

## (Give Attendance to studying God's word)

"నేను వచ్చువరకు చదువుట యందును, హెచ్చరించుటయందును, బోధించుట యందును జాగ్రత్తగా ఉండుము" అని అపో.పౌలు తిమోతిని హెచ్చరించాడు (1 తిమో 4:13). "నీ అభివృద్ధి అందరికీ తేటగా కనబడు నిమిత్తము వీటిని మనస్కరించుము, వీటి యందే సాధకము చేసికొనుమని" అతడు మరల చెప్పాడు (1 తిమోతి 4:15). "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కర లేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచు కొనుటకు జాగ్రత్త పడుము" అని 2తిమోతి 2:15లో వ్రాయ బడి యున్నది.

" మీరు నా వాక్యమునందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రుల నుగా చేయునని" యేసు ప్రభువు చెప్పారు (యోహాను 8:31). దేవుని వాక్యమును చదువుటకు, ధ్యానించుటకు, మనస్కరించుటకు సమయాన్ని వెచ్చించాలి.

మనము ఆయన గ్రంధమును

దినదినము పఠించాలని దేవుడు కోరుచున్నారు. ఆయన తన గ్రంథాన్ని లిఖించి యిచ్చారు గనుక, దాన్ని మనం చదవాలనే ఆయన కోరుచున్నారు. "యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి" యని ప్రవక్తయైన యెషయా పలికాడు (యెషయా 34:16). దేవుని యొక్క నిబంధనలను మోషే ఇశ్రాయేలీయులకు చదివి వినిపించేవాడు. అతడు యెహోవా మాటలన్నిటిని విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరు యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని యేక శబ్దముతో ఉత్తర మిచ్చిరి (నిర్గమ 24:3-4). ప్రతి యేడవ సంవత్సరాంతమున ఇశ్రాయేలీయులలో పురుషులేమి, స్త్రీలేమి, పిల్లలేమి, పరదేశులేమి వారందరి యెదుట దేవుని ధర్మశాస్త్రము ప్రకటింపబడి వారికి వినిపింపబడేది (నిర్గమ 31:10-12).

రాజైన యోషీయా కాలములో ధర్మశాస్త్రగ్రంథము వారికి దొరికెను. "అప్పుడు రాజు యూదా పెద్దల నందరిని, యెరూషలేము కాపురస్థులందరిని యాజకులను ప్రవక్తలను, అల్పులనేమి, ఘనుల నేమి జనులందరిని పిలుచుకొని, యెహోవా మందిరమునకు వచ్చి వారు వినుచుండగా, యెహోవా మందిరమందు దొరికిన నిబంధన గ్రంథములోని మాటలన్నిటిని చదివించెను" (2 రాజులు 23:1-2).

శాస్త్రియైన ఎజ్రా కాలములో దేవుని గ్రంథము సుదీర్ఘముగ చదివి వినిపించబడేది. "ఇశ్రాయేలీయులు అన్యజనులందరిలో నుండి ప్రత్యేకింపబడినవారై నిలువబడి తమ పాపములను, తమ పితరుల పాపములను ఒప్పుకొనిరి. మరియు ధర్మశాస్త్రగ్రంథమును చదువుచు వచ్చిరి" (నెహెమ్యా 8,9 అధ్యా).

దేవుని ధర్మశాస్త్రగ్రంథమును ప్రజలు తప్పక చదవాలి యని యేసు ప్రభువు కూడ గుర్తించారు. "ఆయన వారితో ఇట్లనెను-తానును తనతో కూడ నున్నవారును ఆకలిగొని యుండగా దావీదు చేసిన దానిని గూర్చి మీరు చదువలేదా ?" (మత్త 12:3). "మృతుల పునరుత్థానమును గూర్చి -నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను యాకోబు దేవుడనై యున్నాని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా?" యని ఆయన మరొక మారు ప్రశ్నించారు (మత్త 22:31). మీరు చదువలేదా? యని యేసుప్రభువు తన్ను వెంబడించు వారిని పలు మారులు ప్రశ్నించినట్లు క్రొత్త నిబంధనలో మనము చూడగలము.

యేసుప్రభువు తానే దేవుని గ్రంథాన్ని చదివే వారు. "ఆయన తాను పెరిగిన నజరేతునకు వచ్చెను. తన వాడుక చొప్పున విశ్రాంతి దినమందు సమాజ మందిరము

లోనికి వెళ్లి చదువుటకై నిలుచుండగా ....” అని లూకా 4:16లో వ్రాయబడి యున్నది. అపొ. పౌలు పరిశుద్ధాత్మ ప్రేరణతో తాను వ్రాసిన సంగతులను “మీరు చదివిన యెడల దానిని బట్టి ఆ క్రీస్తు మర్మమును గూర్చి నాకు కలిగిన జ్ఞానమును గ్రహించుకొనగలరు” అని చెప్పాడు (ఎఫెసీ 3:3,4). మరియు థెస్సలోనీకయలోని సంఘమునకు వ్రాయుచు “సహోదరులందరికిని పత్రిక చదివి వినిపించ వలెనని ప్రభువు పేరట మీకు ఆనబెట్టు చున్నాను” అని చెప్పాడు (1థెస్స 5:27).

ఐతియోపీయ ఘనుడు ఆరాధించుటకు యెరూషలేమునకు వచ్చియుండెను. అతడు తిరిగి వెళ్లుచు తన రథము మీద కూర్చుండి ప్రవక్తయైన యెషయా గ్రంథము చదువుచుండెను (అపొ.కా. 8:27-28). “ ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయడిన సంగతులను గైకొను వారును ధన్యులు” అని భక్తుడైన యోహాను వ్రాసాడు (ప్రక 1:3).

ఎవరైన మనకు ఉత్తరాలు వ్రాస్తే వాటిని మనం చదువుతామని కోరికతోనే గదా వారు వ్రాసేది? అట్లే దేవుడు మనకు లిఖించి యిచ్చిన తన వర్తమానాన్ని మనం చదవాలనియే ఆయన కోరుచున్నారు. ఆయన గ్రంథమును చదువు వారును, దానిలో వ్రాయబడిన సంగతులను గైకొను వారును ధన్యుల వుతారు. భక్తుడైన దావీదు ఇట్లు చెప్పాడు: “దుష్టుల ఆలోచన చొప్పున నడువక, పాపుల మార్గమున నిలువక అపహాసకులు కూర్చుండుచోటను కూర్చుండక, యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రము దానిని ధ్యానించువాడు ధన్యుడు. అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె యుండును” (దా.కీర్తన 1:1-3).

“దేవుని వాక్యమును విని దానిని గైకొనువారు మరి ధన్యులని” యేసుప్రభు చెప్పారు (లూకా 11:28). ఇందు విషయమై ఆయన ఇట్లు బోధించారు: “కాబట్టి యీనా మాటలు విని వాటి చొప్పున చేయు ప్రతివాడును బండమీద తనయిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలి యుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను. గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను గాని దాని పునాది బండ మీద వేయబడెను గనుక అది పడలేదు. మరియు ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడును ఇసుక మీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. వాన కురిసెను, వరదలు వచ్చెను, గాలి విసిరి ఆ యింటి మీద కొట్టెను, అప్పుడది కూలబడెను;

దాని పాటు గొప్పదని చెప్పెను" (మత్తయి 7:24-28).

"అందుచేత సమస్త కల్మషమును, విస్తరించుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తి గల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి. మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోస పుచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి"యని యాకోబు హెచ్చరించాడు (యాకోబు 1:21-22).

బైబిలు గ్రంథము దేవుని వాక్యము గనుక దానిని చదువునప్పుడెల్లా, లేక దానిలోనిది చదివించుకొనునప్పుడెల్లా దేవుడు మనతో మాట్లాడుచున్నాడని గ్రహించుకోవాలి. ఆయన తన గ్రంథమునకు వేరుగా ప్రత్యక్షముగా ఈ నాడు ఎవరితోను మాట్లాడుటలేదు. ఆయన గ్రంథమును చదువుట ద్వారా గాని, లేక వినుట ద్వారాగాని మనకు విశ్వాసము కలుగును. "కాగా వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:17). "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను. అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండ లేదుగాని, యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" అని భక్తుడైన యోహాను వ్రాసాడు (యోహాను 20:30,31).

మనం యేసునందు విశ్వసించాలి, పాపముల విషయమై మారు మనస్సు పొందాలి. పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలి, దినదినము ఆయన వాక్యాన్ని పఠించాలి, ఆత్మీయంగా ఎదగాలి !! అందులకై దేవుడు మనకు సహాయం చేయును గాక !!.

**క్రైస్తవరుజువులు :**

## క్రీస్తు నుండి రుజువు
## (Evidence From Christ)

చరిత్రలో క్రీస్తును గూర్చిన ఋజువులను పరిశీలించిన తరువాత మోషే ద్వితీయోపదేశ కాండము 18:15-18లో ప్రవచించిన ప్రవక్త యేసే యని మనం నిర్ధారణకు రావచ్చును. దేవుని నిజప్రవక్త ఎల్లవేళలా సత్యమునే పలుకును. బైబిలును గూర్చి యేసు ఏమి చెప్పారు ?

**పాతనిబంధన :**

యేసు బోధించే సమయాల్లో తరచు పాతనింబంధన యొక్క యదార్థతను, నమ్మకత్వాన్ని ఆయన

రుజువు చేసారు. యేసుపాత నిబంధన అనే పదాన్ని వినియోగించక పోయినను అప్పటికి పాతనిబంధనలోని పుస్తకము లన్నియు సాధరణంగా వాడబడుచునే యుండేవి.

హెబ్రీయులు పాతనిబంధనను మూడు భాగములుగా విభజించిరి. 1) ధర్మశాస్త్రము 2) ప్రవక్తలు 3) కీర్తనల గ్రంధము లేక లేఖనములు

**హెబ్రీయుల బైబిలును యేసు ఆమోదించారు :**

యేసు ఆమోదించిన కొన్ని పాతనిబంధన లేఖనములను ఇప్పుడు గమనించుము. హెబ్రీయులు పరిశుద్ధగ్రంధాన్ని తనాఖ్ అని పిలిచేవారు. ఇప్పుడు మనం వాడే పాతనిబంధన, తనాఖ్ ఒక్కటే . గాని హెబ్రీ గ్రంధములో పుస్తకముల కూర్పు అటుయిటు యున్నది. పాతనిబంధన గ్రంధము (తనాఖ్ ) దేవుని వాక్యమని క్రీస్తు నిస్సందేహముగా అంగీకరించారు, అట్లు బోధించారు. ఉదాహరణలు గమనించుదాము.

**1.** రాళ్లను రొట్టెలుగా మార్చుమని సాతాను యేసును శోధించినప్పుడు, యేసు "మనుష్యుడు రొట్టె వలన మాత్రము కాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును అని వ్రాయబడి యున్నదని " జవాబిచ్చారు (మత్తయి 4:4). ప్రతి శోధనలలోను యేసు అని వ్రాయబడియున్నదని జవాబిచ్చుచు పాతనిబంధన లేఖనములను ఎత్తిచూపించారు (మత్త 4:7,10).

**2.** ఒక సందర్భములో యేసు, "నోవహు దినములు ఏలాగుండెనో మనుష్య కుమారుని రాకడయు అలాగే ఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినము వరకు వారు తినుచు, త్రాగుచు పెండ్లి చేసికొనుచు, పెండ్లికిచ్చుచు నుండి జలప్రళయము అందరిని కొట్టుకొని పోవు వరకు ఎరుగకపోయిరి అని చెప్పారు. (మత్త 24:37-39). ఆదికాండము 6-8 అధ్యాయాల్లో లిఖించబడిన జలప్రళయం యదార్థమైనదని యేసు ఇక్కడ వక్కాణించుచున్నారు. సందేహాశీలులైతే జలప్రళయం సంభవించినదని నిరాకరిస్తారు.

**3.** పరిసయ్యులు సద్దూకయ్యులు యేసు శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనం చేయుటను విమర్శించినప్పుడు యేసు ఇట్లు చెప్పారు: "మీరును మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు? తల్లిదండ్రులను ఘనపరచుమనియు తండ్రినైనను తల్లినైనను దూషించువాడు తప్పక మరణము పొందవలెననియు దేవుడు సెలవిచ్చెను"(నిర్గమ 20:12;

21:7). "మీరైతే ఒకడు తన తండ్రినైనను తల్లినైనను చూచి నావలన నీకేది ప్రయోజనమో అది దేవార్పితమని చెప్పిన యెడల అతడు తల్లినైనను తండ్రినైనను ఘనపరచ నక్కరలేదని చెప్పుచున్నారు. మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు" (మత్త 15:3,6). పాతనిబంధ నలోని ఈ లేఖనములను యేసు దేవుని వాక్యములని సూచించారు.

**లేఖనములు :**

పాత నిబంధనను యేసు పదేపదే లేఖనములు అని ఉచ్చరించారు. యూదుల సమాజ మందిరములో యెరూషలేములో సద్దూకయ్యులు యేసును మాటలలో పడగొట్టాలని ఉద్దేశించి పర లోకములో వివాహమును గూర్చి ప్రశ్నించారు. "అందుకు యేసు లేఖనములను గాని దేవుని శక్తిని గాని ఎరుగక మీరు పొరబడుచున్నారు. పునరుత్థానమందు ఎవరు పెండ్లి చేసికొనరు. పెండ్లికియ్యబడరు; వారు పరలోక మందున్న దూతలవలె ఉందురు. మృతుల పునరుత్థానమును గూర్చి – నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడనై యున్నానని దేవుడు మీతో చెప్పిన మాట మీరు చదువలేదా? (నిర్గమ 3:6). ఆయన సజీవులకే దేవుడు కాని మృతులకు దేవుడు కాడని వారితో చెప్పెను" (మత్తయి 22:29-32).

**ధర్మశాస్త్రము, ప్రవక్తలు :**

పాత నిబంధన లేఖనములను యేసు ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథము అని చెప్పారు. కొండమీద చేసిన ప్రసంగములో యేసు "ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనములైనను కొట్టివేయవచ్చితినని తలంచవద్దు ; నెరవేర్చుటకే గాని కొట్టివేయుటకు నేను రాలేదు. ఆకాశమును భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరు వరకు దాని నుండి ఒక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను" (మత్త 5:17-18). మరల లేఖనములు దేవుని వాక్యములని యేసు చెప్పారు. పరిశుద్ధ లేఖనములు నాశనము కాజాలతత్వము గలవై యున్ననని ఈ లేఖనాల్లో యేసు చెప్పారు. మరియు వాటిని నెరవేర్చడానికే తాను వచ్చానని యేసు చెప్పారు.

ఆయన పునరుత్థానుడైన తరువాత యేసు తన శిష్యులతో, "మోషే ధర్మశాస్త్రములోను, ప్రవక్తల గ్రంథములోను కీర్తనలలోను, నన్ను గూర్చి వ్రాయబడినవన్నియు నెరవేరవలెనని నేను మీ యొద్ద ఉండినప్పుడు మీతో చెప్పిన మాటలు

24:44). పాత నిబంధనలో యేసు క్రీస్తును గూర్చిన లేఖనములలోయున్న మెస్సీయను గూర్చిన ప్రవచనములను బట్టి యేసువాటిపై తన ఆమోద ముద్రనుంచెను.

**క్రొత్తనిబంధన :**

యేసు యొక్క జీవిత కాలములో క్రొత్త నిబంధనలేదు. గాని ఆయన దాని రాకడను చూచారు. నిర్ధారించారు. దేవుని మాటలనే యేసు పలికారు. "గనుక నేను చెప్పుసంగతులను తండ్రినాతో చెప్పిన ప్రకారము చెప్పుచున్నానని" ఆయన అన్నారు (యోహా 12:50). "ఆకాశమును భూమియు గతించును గాని, నా మాటలు ఎన్నటికిని గతింపవు" అని కూడ యేసు చెప్పారు (మత్త 24:35). యేసు మాటలే దేవుని మాటలు. వాటిని భద్రంగా యుంచుటకు ఆయన సంకల్పించి యుండిరి.

ఆయన సిలువ వేయబడక ముందు రాత్రి యేసు తన అంతిమ వర్తమానమును శిష్యుల కందించారు. "నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలిచయజేసితిని" అని వారికి చెప్పారు (యోహాను 15:15). తండ్రియైన దేవుడాయ నకు యేమి బోధించారో. వాటన్నిటిని యేసు తన శిష్యులకు తెలియజేసారు.

ఆ సాయంకాలము యేసు ఆకాశమువైపు కన్నులెత్తి ఇట్లు ప్రార్థించారు

"నీవు నాకు అనుగ్రహించిన మాటలు నేను వారి కిచ్చియున్నాను, వారామాటలను అంగీకరించియున్నారు" (యోహాను 17:8).

యేసు తండ్రి యొద్ద నుండి వాక్యము నంగీకరించారు, దానిని ఆయన తన శిష్యుల కిచ్చారు. అయితే యేసు యొక్క వర్తమానమును అపొస్తలులు సరిగా జ్ఞాపకముంచుకొన్నారో లేదో మనం ఎట్లు తెలిసికొన గలము?

**పరిశుద్ధాత్మ :**

అదే సాయంత్రం యేసు తన అపొస్తలులతో, "నేను నా తండ్రిని వేడుకొందును; మీ యొద్ద ఎల్లప్పుడును ఉండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును" అని చెప్పారు (యోహాను 14:16).

"ఆదరణకర్త అనగా తండ్రి నానామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). "అయితే ఆయన , అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమీ బోధింపక, వేటిని వినునో వాటిని

బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును". (యోహాను 16:13).

అపొస్తలులు తమ జ్ఞాపకశక్తిమీదనే ఆధారపడనవుసరం లేదు. యేసు వారికి బోధించిన ప్రతిమాట పరిశుద్ధాత్ముడు వారికి జ్ఞాపకం చేయును. వారు పరిశుద్ధాత్మ నడిపింపుతో బోధించాలి, ఉపదేశించాలి, లేఖనములను వ్రాయాలి.

**గొప్ప ఆజ్ఞ :**

ఆయన పునరుత్థానుడైన తరువాత యేసు గలిలయలో ఒక కొండ మీద తన అపొస్తలులను కలిసికొని ఇట్లు చెప్పారు: "పరలోక మందును భూమిమీదను నాకు సర్వాధికారమియ్య బడియున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చును నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి'' (మత్త 28:18-20). పెంతెకొస్తునాడు అపొస్తలుల పైకి పరిశుద్ధాత్ముడు దిగివచ్చినప్పుడు వారు యితరులకు బోధించే అధికారమును, శక్తిని పొందిరి (అపొ.కా 1:8; 2:1-4).

గనుక యేసుయొక్క జీవనము, బోధలను గూర్చి మత్తయి, యోహానులు వ్రాసినప్పుడు వారు యేసుక్రీస్తు మాటలను దోషరహితముగా లిఖించిరి. ఏలయనగా వారు పరిశుద్ధాత్మచే నడిపింపబడిరి. పౌలు పేతురు, యోహానులు ఆయా పత్రికలను వ్రాసినప్పుడు పరిశుద్ధాత్మావేశ పూర్ణులై సత్యమును వ్రాసిరి. అందువలననే పౌలు యొక్క వ్రాతలు లేఖనములని పేతురు అంగీకరించాడు (2 పేతురు 3:16).

ఎఫెసులో పౌలు 12గురి మీద తన చేతులుంచగా వారు భాషలతో మాటలాడుట కును, ప్రవచించుటకును మొదలు పెట్టిరి (అపొ.కా. 19:6).

పేతురు యొక్క సహకారియగు మార్కు, పౌలు యొక్క సహకారియగు లూకా, యాకోబు యూదా అను యేసు యొక్క సోదరులు అందరు ప్రవచన వరమును పొందిరి. తత్ఫలితముగా వారు వ్రాసిన లేఖనములు క్రొత్త నిబంధనలో చేర్చబడెను.

మోషేవలె యేసు ప్రవక్తయే, ఆయన సత్యమునే పలికెను. మరియు పాతనిబంధన (తనాఖ్) దేవుని వాక్యమని నిర్ధారించెను. మరియు రాబోవుచున్న క్రొత్త నిబంధనను ముందుగానే నిర్ధారించెను. అందువలన బైబిలు నమ్మతగిన గ్రంధమని మనం రూఢిగా చెప్పవచ్చును !!

# దేవుడు సర్వ శక్తిమంతు
## (God is Omnipotent )

పరమందొక దేవుడున్నాడు ! ఆయన ఎట్లుంటారు ? ఆయన సర్వశక్తి మంతుడు. అంటే ఆయన అపరిమిత శక్తిగల దేవుడు. ఆయన సర్వశక్తిగల దేవుడని ఆదికాండము 17:1 చెప్పుచున్నది. "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనానున్నదా ? " అని ఆదికా 18:14 లో ప్రశ్నవేయబడినది. "నీవు సమస్త క్రియలను చేయగల దేవుడవని " యోబు పలికాడు (యోబు 42:2). "సర్వాధికారియు, ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు, ఆయనను స్తుతించుడి" యని ప్రకటన 19:6లో చెప్పబడి యున్నది, "దేవునికి యేదీ అసాధ్యము కాదని లూకా 1:37లో గ్రహించు కోగలము.

**దేవుడు సర్వశక్తిమంతుడే గాని పరిమితి చేసుకొన్నాడు ( God is Limited, yet Omnipotent )**

బైబిలునందలి పైలేఖన భాగము లన్నియు సత్యమే. అయితే వాటికి భిన్నముగా యున్నట్లు కనబడుచున్న లేఖనభాగం ఇంకోటి యున్నది, దేవుడు అబద్ధమాడజాలడని హెబ్రీ 6:18 చెప్పుచున్నది. దేవునికి సమస్తమును సాధ్యమేయని మత్తయి 19:26 చెప్పుచున్నందున ఈ మాటనెట్లు చెప్పగలము? ఆయనకు, సమస్తమును సాధ్యమేయని ఒక వచనము ఆయన అబద్ధమాడుట అసాధ్యమని ఇంకో వచనము చెప్పుచున్నవి. యిది స్వవిరుద్ధము కాదా ?

దేవుడు సర్వశక్తిమంతుడన్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన వలసి వచ్చును. దేవుడు సర్వశక్తి మంతుడై యుండియు, శక్తి హీనముగా యుండ జాలడు. ఆయన ఒకే సమయమందు ఉండడానికి, ఉండకుండడానికి ఎంచుకోలేడు. ఆయన తన్నుతాను నాశనంచేసి కొనడానికి, అదేసమయందు తనలాంటి పది దేవుళ్లను సృజించుకొనడానికి ఎంచుకోలేడు, ఆయన ఎక్కలేని పర్వతమును, ఎత్తలేని బండను సృజింపజాలడు. ఆయన పరిశుద్ధుడుగాను, దుష్టునిగాను ఉండుటకు ఎంచుకోలేడు. ఒకే సమయమందు చూడడానికి, చూడకుండడానికి, వినడానికి వినకుండ డానికి ఎంచుకోలేడు.

అయితే దేవుడు సర్వశక్తిమంతుడైతే, అదే శక్తి వలన తన సర్వశక్తిని పరిమితి చేసుకోగలడా? తన స్వశక్తిని పరిమిత చేసుకోలేని వాడైతే ఆయన సర్వశక్తిమంతుడుకాడు, గనుక తన సర్వశక్తివలన దేవుడు

కొన్ని సంగతులను సాధ్యపరచును, ఆయన సర్వశక్తిని బట్టి ఆయన బలహీను డగుట, అబద్ధములాడుట, పాపము చేయుట ఆయనకు అసాధ్యము, అందు వలన ఆయన శక్తిహీనుడుకాదు. ఆయనకు కొన్ని అసాధ్యములైనందున ఆయన యొక్క సర్వశక్తిగల తత్వము బలపడుచున్నది.

**దేవుడతన శక్తిని అదుపులో యుంచుకొన్నారు :**

దేవుడు దేనినైనా చేయడానికి శక్తిగలవాడే అయినను, దానిని చేయడానికి గల శక్తిని వినియోగించుటకు ఎంచుకొంటాడని యర్ధము కాదు. మానవులందరినీ మంచి చేసే మరమనుష్యులుగా చేయగల శక్తి ఆయనకున్నది. చెడుగు చేయలేని మరమనిషిగా ఆయన మనలను చేయ గలరు. మానవులు చేయగల వాటన్నిటినీ ఆయన అతని నుండి తీసివేయుటకు ఆయనకు శక్తి వున్నది. అయితే ఆ శక్తిని వినియోగించుటకు ఆయన పూనుకొనరు. ఆయనకు శక్తి యున్నంత మాత్రన దానిని వినియోగించేస్తారని అర్ధముకాదు. మన ప్రాణాన్ని తీసేసుకొనే శక్తి మనందరికీ యున్నది. గాని అట్లు దానిని వినియోగించేస్తామని దాని యర్ధముకాదు. ఈ ప్రపంచములో శక్తిగల అగ్రరాజ్యముల చేతిలో అణుబాంబులు, హైడ్రోజన్ బాంబులు వున్నాయి, వాటితో మానవ జాతిని నాశనం చేసే శక్తి వారికున్నది. అయితే వాటిని వినియోగించుటకు వారు ఎంచు కొనరు.

ఈ విధంగా దేవుని నిజతత్వాన్ని కొందరు అర్థము చేసికొనుటకు ప్రయత్నించరు. ఈ లోకంలో యున్న అసంపూర్ణతలను బట్టి కొందరు దేవునినే నిరాకరిస్తారు. అన్యాయాన్ని, అక్రమాన్ని అదుపు చేయుటకు దేవుడు జోక్యం చేసికోరు గనుక దేవుడు లేడని వారంటారు. పరమందొక దేవుడుంటే ఈ లోకం పరిపూర్ణంగా యుంటాది. దుష్టత్వాన్ని, వ్యాధిని, మరణాన్ని తుడిచివేసే శక్తి దేవునికుండినట్లయితే, దానిని ఆయన చేయకపోతే ఆయన అన్యాయ స్థుడని వారంటారు.

**అసంపూర్ణతలు నాశనం చేయబడును: (Imperfections will be destroyed)**

అన్యాయము, అక్రమము నిత్యము కొనసాగేలాగున ఉంటే దేవుడు లేడని మనందరం న్యాయబద్ధంగా తలంచవచ్చును. ఈ లోకంలో యున్న అపరిపూర్ణతలు, అన్యాయములు, ఈలోకంతో బాటు నాశనం గావించబడునని బైబిలులో మనకు చెప్పబడినది. 2 పేతురు 3:10 ఇట్లు చెప్పుచున్నది : "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును,

ఆదినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీద నున్న కృత్యములును కాలిపోవును". "ఎందు కనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచు వరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను కడ పట నశింపజేయబడు శత్రువు మరణ ము" అని క్రీస్తును గూర్చి 1 కొరింథీ 15:25-26లో చెప్పబడియున్నది. యిది జరిగినప్పుడు దుష్టత్వము, రోగము, లేకుండా పరిపూర్ణంగా మనందరం నిత్యము జీవించెదము..

**ఇప్పుడు దేవుడు ప్రేమతో పాలించు చున్నారు.**

ఇప్పుడు దేవుడు ప్రేమ శక్తిని (యోహాను 3:16), సువార్త శక్తిని (రోమా 1:16) దుష్టత్వాన్ని ఎదుర్కొనుటకు మానవులు మంచిని అంగీకరించి దానిని చేయుటకు వినియోగించుచున్నారు. ఈ రీతిగా మానవులు ఆయన నామమును మహిమపరచి, ఆయన కుమారుడైన క్రీస్తును ఒప్పుకొనుటకు ప్రోత్సహించు చున్నారు. అయితే అట్లు చేయుటకు మానవులు ఎంచుకొనకపోతే, ప్రేమవలన దేవుడు ఒకానొక దినమందు ఆయన సర్వశక్తిని బట్టివారు అట్లు చేయుటకు బలవంతము చేయును. ఒకానొక దినమందు దేవుని మహిమార్థమై ప్రతి మోకాలును ఆయన నామున వంగు ననియు, ప్రతినాలుకయు ఆయన నామమును ఒప్పుకొనుననియు ఫిలిప్పీ 2:11 చెప్పుచున్నది.

ఒక్కోసారి దేవుడు తన శక్తిని వినియోగించుటలేనట్లు కనబడుచున్నది ఏలయనగా అపవాది, వాని అనుచరులగు దుష్టులు ఎంతో దుర్మార్గతను జరిగించు చున్నారు. దేవుడు కొన్ని సంగతులను ఎందుకు జరుగనిస్తారో, కొన్ని సంగతులను ఎందుకు జరుగకుండా ఆపుచేయరో మనకు తెలియదు, గాని ఆయనకు శక్తి లేనందు వలన మాత్రము కాదు. "ఇహమందును పరమందును సర్వాధికారము నాకీయబడి యున్నదని " క్రీస్తు చెప్పారు (మత్తయి 28:18). "మరియు మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములో యున్నవి " యని ఆయన చెప్పారు (ప్రక 1:18). "దేవుడు మానవుల రాజ్యముపైని అధికారియై యుండి, తానెవ రికి అనుగ్రహింప నిచ్ఛయించునో వారికనుగ్రహించునని" దానియేలు 4:17 చెప్పుచున్నది.

దేవుడు క్రీస్తుద్వారా ఇప్పుడు అట్టి శక్తిని వినియోగించుచున్నారు. భవిష్యత్తులో ఆయన ఇంకా ఎక్కువ శక్తిని ఉపయోగి స్తారు . అప్పుడు మానవులు దూతలతో కూడ "వధింపబడిన గొర్రెపిల్ల శక్తియు

ఐశ్వర్యమును జ్ఞానమును బలమును ఘనతయు మహిమయు స్తోత్రమును పొందనర్హుడని గొప్ప స్వరముతో చెప్పు దురు" (ప్రక 5:12).

**సృష్టిలో దేవుడు సర్వశక్తిమంతుడు:**

సర్వశక్తిమంతుడను మాటల యొక్క భావమును మన పదజాలముతో పూర్తిగ వివరించలేము, పరిమితి గల మానవజ్ఞానము దానిని పూర్తిగ గ్రహించు కోలేదు గాని ఈ గొప్ప సత్యమును మరింత లోతుగా పఠించుటకు పూనుకొందము.

ఈ లోకము సృష్టింపబడినప్పుడు దేవుని సర్వశక్తిమానవునికి మొదట ప్రత్యక్షపరచబడినది. " ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైన వనియు అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు" హెబ్రీ 11:3 చెప్పుచున్నది. ఆదిలో దేవుడు మాటపలుకగా అట్లాయె ను. ఆయన ఫలానాది కలుగుగాక అని పలుకగా అది సృష్టింపబడెను (ఆది.కా. 1:3,6,9, 11,14,20,24,26). భూమ్యాకాశములు సృజింపబడిన తరువాత "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిగ నుండెను" (ఆది.కా. 1:31).

యిదంతయు దేవుని వాక్శక్తి వలన జరిగెను. ఆయన పలుకగా అవి కలిగెను. ఆయన ఆజ్ఞ ఇయ్యగా అవి ఏర్పడెను. దేవుని వాక్యము అగ్నివంటిద నియు, సుత్తె వంటిదనియు యిర్మీయా 23:29 చెప్పు చున్నది. అది దహించును, బ్రద్దలుచేయును. ఆయన వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగల దియై యున్నదని హెబ్రీ 4:12 చెప్పు చున్నది.

ఆయన వాక్ శక్తి వలన ప్రతి పర్వతమును ఎత్తెను, ప్రతిలోయను దించెను, శక్తివంతమైన సూర్యుని మండింపజేసెను, తమ కక్ష్యలలో గ్రహములనుంచెను, నక్షత్రములను వెలిగించెను, ఆకాశములో మహిమాన్వి తమైన ఇంద్ర ధనస్సునుంచెను. ఆయన జలములను సముద్రములుగా మార్చెను, పచ్చగడ్డిని మొలిపించెను. ఆయన సముద్రములను చేపలతోను ఆకాశము ను పక్షులతోను, భూమిని జంతువులతోను నింపెను. ఆయన చేసిన మంటినుండి మానవుని చేసి వానిలో తన జీవపువూ పిరి ఊది దైవత్వము యొక్క కొంత భాగాన్ని వానికి ప్రసాదించెను. తాను చేసిన ప్రపంచముతోను, తన తోను మానవుడు ఎడబాయకుండా యుండుట కాయన మానవుని చేసెను. ఈ లోకాని కి, మొదటి మానవునికి దేవుడు ఏ వయస్సు ననుగ్రహించి సృజించెనో మనకు తెలియదు. ఆదిలో ప్రతి సంగతిని

మాట చెప్పి ఆయన ఆరు దినములలో సృజించెను. ఆయన మాటలో యున్న శక్తిని బట్టి సమస్తము సృజింపబడెను. “ఆకాశమును భూమియు వాటిలోనున్న సమస్త సమూహము సంపూర్తిచేయబడెను, దేవుడు తాను చేసిన తన పని యేవదది నములోగా సంపూర్తి చేసి తాను చేసిన తనపని యంతటినుండి యేడవ దినమున విశ్రమించెను” (ఆదికా 2:1-2).

**ఈ విశ్వములోని అద్భుతములు దేవుని సర్వశక్తిని ప్రచురము చేయుచున్నవి:**

మనం ఈ ప్రపంచములోని ఆశ్చర్యములను తిలకించుచుండగా, ఆయన చేసిన సృష్టిని వృక్షములను జంతువులను పరికించుచుండగా దేవుని సర్వశక్తిని కొంతమట్టుకు గ్రహించు కోగలము. కీర్తనలు 19:1-4 ఇట్లు చెప్పుచున్నది, “ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురము చేయు చున్నది. పగటికి పగలు బోధచేయు చున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాషలేదు, మాటలు లేవు, వాటి స్వరము వినబడదు. వాటికొలనూలు భూమి యందంతట వ్యాపించి యున్నది. లోకదిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్లు చున్నవి. వాటిలో ఆయన సూర్యునికి గుడారము వేసెను”.

“దేవుని అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడు చున్నవి గనుక వారు నిరుత్తరులైయున్నారు” అని రోమా 1:20 చెప్పుచున్నది. దేవుడెట్లుం టారో తెలిసికొనగోరినచో మీరు ఒకమారు ఆయన చేసిన ప్రపంచములను పరికించ ండి. అప్పుడాయన యొక్క సర్వశక్తిన్ని మీరు గ్రహించుకొనుటకారంభించుదురు.

**మానవుడు దేవుని సృష్టి యొక్క గొప్ప అద్భుతము :**

ఈ విశ్వము తన వైభవంతో దేవుని సర్వశక్తిని ప్రచురించుట కారంభిస్తాది. ఆయన ఈ విశ్వాన్ని చేసారు. అయితే దాని కంటే గొప్ప దేమంటే ఆయన మానవునిలో జీవించు ఆత్మనుంచి, వాని ద్వారా గొప్ప లోకమును చేసారు. ఆ లోకము బండల తోను, రాళ్లతోనుగాక గొప్ప తలంపుల యొక్కయు ఆదర్శముల యొక్కయు లోకమును చేసారు. దేవుని కుమారుడైన యేసుక్రీస్తు సువార్తలోని శక్తి ద్వారా ఆయన మానవుని రూపుదిద్దుచు జంతుస్వభావమునుండి పరలోక కాంక్షలు గలవానిగ తయారుచేయుచున్నారు. దేవుని గూర్చిన జ్ఞానము లేని యెడల మానవుడు నరహత్యకు, దురాశకు, స్వార్థానికి, కామానికి, అసూయకు దొంగతనానికి, అక్రమ సంబంధములకు, అబద్ధములకు,

సోమరితనానికి, దేశద్రోహానికి పాల్ప డతాడు. అయితే దేవుని గూర్చిన జ్ఞానము వలన మానవుని ఆత్మలో సత్యము, దయ ప్రేమ, క్షమాపణ, వినయము, సాత్వికము, పొదుపు, పరిశ్రమ, పట్టుదల, శక్తి, ఘనత, నమ్మకత్వము, యదార్థత ఉద్భవిస్తాయి.

దేవుని గూర్చిన జ్ఞానమున్నచోట గృహాలలో సంతోషము, పంటలలో ఎక్కువ దిగుబడి, పౌరులలో నమ్మక త్వము, సమృద్ధియైన ఆహారములభిస్తాయి. కళలలో పవిత్రత, ఆహ్లాదకరమైన సంగీతము, శ్రేష్టమైన విద్యకనబడ్తాయి వైజ్ఞానికి శాస్త్రము మరికొన్ని రహస్య ములను ఛేదిస్తాది. వైద్యులు మరింత నైపుణ్యత గలవారవుతారు. ప్రభుత్వములు శ్రేష్టపాలన నందిస్తారు. దేవుని జ్ఞానము గల చోట వృద్ధులు, విధవ రాండ్రు, అనాధలు. అంగహీనులు, మొ॥గువారు పోషించబడి ఆదరించ బడ్తారు.

యిదంతా ఎట్లు జరిగించబడ్తాది? గుత్తాధిపత్యము వలననా? బలవంతము వలననా? కానేకాదు గాని మంచితనము, దయ, పరిశుద్ధత, సత్య ప్రేమల వలన జరిగించబడ్తాది. మంచి తనము మనల ను మంచిగా యుండుటకు ప్రోత్సహిస్తాది. దయను బట్టి దయ మనకు బోధించ బడ్తాది. మనం సాధించడానికి పరిశు ద్ధత, ఉన్నత ఆదర్షమును నెలకొల్పుతాది. న్యాయ సూత్రములు సత్యము వలన స్థిరపరచబడ్తాయి. బండలలాంటి హృద యాలను ప్రేమకరిగించి నీతిగల సమాజ మును తయారుచేస్తాది.

**నీవెంత గొప్ప దేవుడవో !**

దేవువు తన వాక్ శక్తి వలన సమస్తమును చలింపజేయుచున్నారని హెబ్రీ 11:3 చెప్పు చున్నది. దేవుడు మాట్లాడగా వర్షము కురియును, ఆయన ఆజ్ఞఇయ్యగా తన నిధులతో నిండిన హిమము భూమిపై వర్షించును. ఆయన సంకల్పము చొప్పున మెరుపులు మెరియు ను, ఉరుములు ఉరుమును. ఆయన మైదానములలోని జంతువుల కాహార మిచ్చును, అడవి పువ్వులకు వర్ణింపన శక్యమైన అందము నొసంగును, ఆయన మరణము యొక్కయు జీవము యొక్కయు రహస్యములను తన ఆలోచనలోనే యుం చుకొనును. సాతాను యొక్కయు నరకము యొక్కము శక్తిని పరిమితిచేయును, ఆయన శాసనము చొప్పున ప్రపంచమం దంతటా విత్తనములు మొలకెత్తును. ఈ విశ్వములోనిగేలాక్సీలన్నీ గొప్ప క్రమము చొప్పున అతి శ్రేష్టమైన గడియారమువలె తమ తమ కక్ష్యలలో తిరుగును, ఆయన పర్వతములను అడవులతో కప్పును, లోయలలో పచ్చని తివాచీని పరుచును ఆయన శక్తిని బట్టి మానవుడు జీవించును, ఆలోచించును, సంకల్పించును, నిర్మించు ను, మరణించును, జననము యొక్క

అందాన్ని వివరించుటకు సమయం చాలదు, శిశువు యొక్క సొగసు, తల్లియొక్క ప్రేమ, సూర్యాస్త మయము యొక్క మహిమ, మేఘముల యొక్క ఘనత, పర్వతములు యొక్క ఔన్నత్యము, నిద్ర యొక్క నిర్మలము, కుటుంబ బంధములు, వర్షములో యున్న సంతృప్తి, పక్షులపాటలలో యున్న ఆనంద ము, ప్రశాంతకర జలములలో యున్న శాంతి, తుఫాను యొక్క భీభత్సము వర్ణించు టకు మనకు సమయం చాలదు. మహోఘ నుడును, మహోన్నతుడును సర్వశక్తిమం తుడైన పరలోక దేవుని శక్తిని గమనించి ఆయనను కొనియాడి కీర్తించుటకు మనలను నడిపించును.

"శాశ్వతుడా ! విస్మయ మొందినేను
నీస్వంత హస్త సృష్టి జూడగా – నీ
స్వరం విందున్ ఉరుములయందు, యేసు ప్రభూ నిన్నారాధింతును
వృక్షంబులందున్ అడవులలోనే
పక్షుల పాటలాలకింతును – తక్షణమగ్ర పర్వతమునుండి
అక్షులతో నీ మహిమను గందున్"
" ఓరక్షకా నీ స్తుతి పాడెదన్ – నూరంతలన్
మహా దేవా–నారక్షకా! నమస్కరింతునిన్
మారని మా యెహెూవా దేవా "!!

ఈ విశ్వము దేవునిచే సృజింప బడి శక్తివలన పాలింపబడు చున్నది. జంతువులు ఇంగిత జ్ఞానము వలన ప్రవర్తించును గాని మానవుడు నైతిక సూత్రములను బట్టి చలించును ఏలయనగా మానవుడు దేవునిలో భాగమైయుండి పరిపూర్ణలోకములో ఆయనతో నివసింపగోరును. ఈ లోకంలో కొంతకాలము మట్టుకు దేవుని సర్వశక్తి పూర్ణముగా బయలు పరచబడలేదు. గాని కాలాంతమున సమస్త దౌష్ట్యము, అసంపూర్ణత జయింపబడి నాశనము గావించబ డును. ఆయనను ప్రేమించి ఆయన ఆజ్ఞలకులోబడిన వారిని దేవుడు మృతులలో నుండి లేపును. వారాయ నతో పరిపూర్ణ జీవితమును శాశ్వతముగ జీవిస్తు దేవునిగొప్ప సర్వశక్తిని పూర్తిగా తిలకించి గ్రహించిన వారవుదురు.

# దేవుని మనమేల సేవింపవలెను ?
## (Why do we Serve God?)

"సమస్త దేశములారా, యెహోవాకు ఉత్సాహధ్వని చేయుడి. సంతోషముతో యెహోవాను సేవించుడి" యనిభక్తుడైన దావీదు కీర్తనల గ్రంథములో హెచ్చరించాడు (కీర్త 100 :1). "ఆయన మీ కొరకు ఎన్నిగొప్ప కార్యములు చేసెనో అది మీరు తలంచుకొని మీరు యెహోవా యందు భయభక్తులు కలిగి నిష్కపటులై పూర్ణ హృదయముతో ఆయనను సేవించుట అవశ్యము" అని ప్రవక్తయైన సమూయేలు హెచ్చరించాడు (1 సమూ 12:24).

దేవుని మరచిన లోకంలో నేడు మనం జీవించుచున్నాము, దేవుని గూర్చి సువార్తికులు జనులను హెచ్చరించుచు యుంటే, దేవుడున్నాడా ? ఆయనను మనమెందుకు సేవించాలి, ఆయనను సేవిస్తే నా కేమి లభిస్తాది ? అనే ప్రజలు నేడు పెక్కుమంది యున్నారు. "మీరెవరిని సేవింప కోరుకొనినను, నేనును నా యింటివారును యెహోవాను సేవించెదమని" ఇశ్రాయేలీయుల నాయకుడను యెహోషువా చెప్పాడు (యెహోషువ 24:15). మనం దేవుని ఎందుకు సేవించాలో తెలిసికొనుట మంచిది.

దేవుడు స్వార్థపరుడైనందున ఆయన మన ఆరాధనను కోరుట లేదు. మనం ఆయనను సేవించుట వలన ఆయన ఘనత మహిమలు పెరిగిపోవు. మనం ఆయననుసేవింపకపోతే ఆయన మహిమ ఏమాత్రము తగ్గిపోదు, ఈ లోకము పుట్టక ముందునుండీ ఆయన మహిమాన్వితుడై యున్నాడు. "ప్రభువా తరతరములనుండి మాకు నివాసస్థలమునీవే. పర్వతములు పుట్టకమునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములు నీవే దేవుడవు" అని అందుకే మోషే ప్రార్థించాడు (కీర్త 90:1-2). మానవులు దైవారాధన చేయకపోతే ఆయన మహిమ ఏమియు తరిగిపోదు. ఆయన ఇశ్రాయేలీయులతో ఇట్లన్నారు: " ఇశ్రాయేలూ, ఆలకింపుము, నేను దేవుడను, నీ దేవుడను. నేను నీ మీద సాక్ష్యము పలికెదను. నీ బలుల విషయమై నేను నిన్ను గద్దించుట లేదు. నీ దహన బలులు నిత్యము నాయెదుట కనబడుచున్నవి. నీయింట మృగములన్నియు, వేయి కొండల మీది పశువులన్నియు నావే గదా, కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును. పొలములలోని పశ్వాదులు నా వశమై యున్నవి. లోకమును దాని పరిపూర్ణతయు నావే.

నేను ఆకలిగొనినను నీతో చెప్పను. వృషభముల మాంసమును నేను తిందునా ? పొట్టేళ్ల రక్తము త్రాగుదునా? దేవునికి స్తుతి యాగముచేయుము. మహోన్నతునికి నీ మ్రొక్కుబడులు చెల్లించుము. ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొర్రపెట్టుము, నేను నిన్ను విడిపించెదను. నీవు నన్ను మహిమ పరచెదవు" (క్రీర్తన 50:8-15). దేవుడు మహిమాన్వితుడు. సమీపింపరాని తేజస్సుగలవాడు. మన ఆరాధన వలన ఆయన ఘనతలో యేమీ మార్పుండదు. సరిగదా ఆయన పరిశుద్ధుడు గనుక ఘనుడు. మనం పాపులము గనుక ఘనహీనులం. అందువలన ఆయనను సేవింప బాధ్యులం.

**దేవుడు ఆత్మయై యున్నాడు :**

గనుక మనం ఆయనను సేవించాలి. ఆయన సర్వాంతర్యామి, నిత్యుడు, పరిశుద్ధుడు, కరుణామయుడు, యదార్థవంతుడు. ఆయన ప్రేమామూర్తి. అందు వలన ఆయన ఆరాధనీయుడు. పూజార్హుడు. అయనే కీర్తనీయుడైన యెహోవా (కీర్త 18:3). "నేను యెహోవాను, మరి ఏదేవుడును లేడు. నేను తప్ప ఏ దేవుడును లేడు.............. నేను వెలుగును సృజించువాడను అంధకారమును కలుగజేయువాడను " అని ఆయన సెలవిచ్చియున్నారు. ఆయన ఒక్కడే నిజదేవుడు గనుక ఆరాధనీయుడు. "పరిశుద్ధ దూతల సభలో ఆయన మిక్కిలి భీకరుడు. తన చుట్టునున్న వారందరి కంటె భయంకరుడు" (కీర్తన 89 :7). దేవుని యొక్క ఇట్టి తత్వాన్ని బట్టి మనం ఆయనను సేవించాలి.

**దేవుడు మన సృష్టికర్త :**

గనుక మనం ఆయనను కొనియాడాలి "సమస్త దేశములారా, యెహోవాకు ఉత్సాహ ధ్వని చేయుడి. సంతోషముతో యెహోవా ను సేవించుడి ఆయన మేపెడు గొర్రెలము. కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములలో ప్రవేశించుడి ఆయనను స్తుతించుడి, ఆయన నామమును ఘనపరచుడి. యెహోవా దయాళుడు, ఆయన కృప నిత్యముండును. ఆయన సత్యము తరతరములుండును" (కీర్తన 100:1-5).

**దేవుడు ప్రేమాస్వరూపి:**

అందువలన మానవుడు తన అంతరంగమున నున్న సమస్తముతో దేవుని స్తుతించాలి. ఆయన మన దోషములను క్షమించువాడు, మన సంకటములను కుదుర్చువాడు. సమాధిలో నుండి మన ప్రాణమును విమోచించువాడు. కరుణా కటాక్షములను మనకు ప్రసాదించువాడు. మేలుతో మనహృదయాన్ని తృప్తిపరచువాడు. యెహోవాదయా దాక్షిణ్య

పూర్ణుడు, కృపా సమృద్ధి గలవాడు, దీర్ఘశాంతుడు. అందువలన యెహోవా సైన్యములారా, ఆయన చిత్తమునెరవేర్చు ఆయన పరిచారకులారా, మీరందరు ఆయనను సన్నుతించుడి (కీర్తన 103 :1-22).

దేవుడు మనలను సృజించినప్పుడు ఆయన ఆత్మీయ స్వరూపాన్నిచ్చి చేసారు. ఆయనకు భౌతిక రూపురేఖలు లేవు. "కావున మీరు ఎవనితో పోల్చుదురు? ఏరూపమును ఆయనకు సాటిచేయగలరు?" అని ప్రవక్త యైన యెషయా ప్రశ్నించాడు (యెషయా 40:18. అందుకే " ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడగు సృష్టికర్తయైన యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు........ భూమిని కలుగజేసిన వాడను నేనే. దాని మీదనున్న నరులను నేనే సృజించితిని నేను ఆజ్ఞయిచ్చితిని" (యెషయా 45:11-12). మనమాయన చేసృజింప బడిన వారము. దేవుడు మన సృష్టికర్త గనుక ఆయనను మనం సేవించాలి .

తరువాత మానవుని పాపపు స్థితిని బట్టి తన పాప విమోచన కర్తయగు దేవుని సేవించాలి. మంచి చెడుగుల విచక్షణ జ్ఞానం గల వారందరు పాపులే. అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). సరిగదా "మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల మన లను మనమే మోసపుచ్చు కొందుము; మరియు మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగిన వాడును నీతి మంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులను గా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1యోహాను 1:8-10).

మానవులు జన్మత : పాపులు కాదు. మంచినిమాని చెడుగు నెంచుకొనుట వలన పాపియగును. పాపము చేయు ప్రతివాడును పాపమునకు దాసుడని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 8:34). దేవుని ఆజ్ఞను అతిక్రమించుట పాపము. మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయని వానికి పాపము కలుగును సకల దుర్నీతియు పాపము. మరియు విశ్వాసమూలము కానిదేదో అది పాపము.

అందువలన "లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో అది చావుని మిత్తముగా పాపమునకే గాని, నీతి

నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడు దురో దానికే దాసులగు దురని మీరెరు గరా?" యని అపొ.పౌలు ప్రశ్నించుచున్నాడు (రోమా 6:16). అతడు మరల ఇట్లనుచున్నాడు: "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమ మునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము" (రోమా 6:17-18). పరిశుద్ధుడైన దేవుడు మాత్రమే మనలను పాపమునుండి విమోచించగలడు, ఆయన మాత్రమే రక్షించ గలడు, గనుక ప్రతి మానవుడు నిజ దేవుని రక్షకుడైన క్రీస్తు ద్వారా సేవించాలి.

**మానవులు నిత్యజీవ నిరీక్షణ కొరకు దేవుని సేవించాలి :**

చావు అనిన భయపడువాడు మానవుడు. అతడు నిత్యము జీవించాలనే కోరిక గలవాడు. యేసు క్రీస్తు అనిత్య జీవాన్ని మనకు ప్రసాదించగలరు. "పాపము వలన వచ్చుజీతము మరణము, అయితే దేవుని కృపావరము మనప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23). మానవులను మరణభయము నుండి విడిపించి నిత్యజీవ నిరీక్షణ నిచ్చుటకే యేసు ప్రభువు ఈలోకానికి వచ్చారు. ఆయన చనిపోయి, సమాధి చేయబడి మూవడ దినమున తిరిగి లేపబడియున్నారు. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రధమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానము కలిగెను" (1 కొరింధీ 15:20-21).

మృత్యుంజయుడై తిరిగి లేచిన యేసు క్రీస్తుమాటలను మనము వినిన యెడల ఆయన నిత్యజీవాన్ని మనకిచ్చును, "నా మాట విని నన్ను పంపిన వానియందు విశ్వాసముంచు వాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటి యున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని" యేసు ప్రభువు చెప్పారు (యోహాను 5:24). "నన్ను నిరాకరించి నామాటలు అంగీకరింపని వానికి తీర్పుతీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చునని" కూడ ఆయన చెప్పారు (యోహాను 12:48).

ఆయన యేమి చెప్పారు ? "నేను ఆయనననని (అనగా దేవుని

కుమారుడనని) మీరు విశ్వసింపని యెడల మీ పాపములోనే మరణింతురని" చెప్పారు (యోహాను 8:24). "మీరు మారు మనస్సు నొందని యెడల మీరందరు అలాగే నశింతురని" ఆయన చెప్పారు (లూకా 13:5). మరియు సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబ డునని" ఆయన చెప్పారు (మార్కు 16:16). గనుక మిత్రుడా యేసుప్రభువు నందు విశ్వాసముంచు, పాపముల విషయమై మారు మారుమనస్సుపొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందు (అపొ.కా. 2:38). రక్షింపబడిప్రభువైన నీదేవుని సేవించుట కారంభించు.

-జాషువాగూటం

గమనిక ::

సత్యవాణి T.V. కార్యక్రమములను
ప్రతి బుధ, వారము సాయంత్రం 6:30 గంటలకు
రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు
ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00
గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

2011 జనువరి 26 వ తేదీ బుధవారం అమలాపురం శాంతినగర్‌లో చక్కగా నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును జాషువా గూటం గారు ప్రార్థించి,రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. స్థానికులు,పట్టణప్రముఖులు,పరిసర సోదరసోదరీలు వందలాదిగా హాజరై ఆ సంతోష కార్యక్రమములో పాల్గొనిరి,తదుపరి జరిగిన కూటములో సోదరులు జాషువా గూటం గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు నిశ్చయించుకొనిరి.

తదుపరి సండేస్కూలు పిల్లలకు మంచి బహుమతులు జాషువా,కవితగూటం గార్ల చేతులమీదుగా అందియ్యబడెను.కూటము అనంతరం హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. అమలాపురం శాంతినగర్ లో సోదరులు తిరుగుళ్ల సత్యసుమెయోన్‌గారు అనేక సంవత్సరాల నుండి సువార్తచాటుచు, సంఘమును స్థాపించి సమర్థవంతముగా నడిపించుచున్నారు.ఆయన ఉద్యోగము చేసి కొనుచు సువార్తపనిలో ఆసక్తికలిగి క్రీస్తుకొరకు గొప్పఫలితములు సాధించుట అభినందనీయము. అమలాపురం శాంతినగర్ లో నిర్మించబడిన ఆలయ ప్రతిష్ట కార్య క్రమమునకు సోదరులు యన్.ఏలియా గారు అధ్యక్షత వహించిరి.సోదరులు V. రాజ్ కమార్ గారు క్లుప్త ప్రసంగము చేయగా సోదరులు తిరుగుళ్ల షాలేము రాజు గారు వందన సమర్పణ చేసి,సత్యము,సత్యవాణి,సత్యవాక్కుల విశిష్టతను సభికులకు తెలియ జేసిరి. సోదరులు బొంతు వెంకటరమణ గారు బహుమతుల ప్రధాన కార్యక్రమమునకు ముందు ప్రార్థన చేయగా సత్యసుమెయెన్ గారి కృతజ్ఞతా వందనములతో కార్యక్రమము సంతోష భరితంగా ముగిసెను.

2011 ఫిబ్రువరి 4,5 తేదీలలో రిక్కీగూటం గారు బోధకులకు ప్రత్యేక తరగతులను ఏర్పాటుచేసిరి. ఆ రెండు దినములలో హాజరగు వారికి భోజనవసతులను ఏర్పాటుచేసిరి. ఈ దినపత్రిక ముద్రించు సరికి ఆ తరగతుల విషయమైన ఏర్పాట్లు చేయటలో ఆయన సమయాన్ని వెచ్చించుచున్నారు. సత్యవాణి ద్వారా జరుగుచున్న అనేక సువార్త కార్యక్రమముల కొరకు ప్రార్థించమనవి.

❊❊❊❊❊❊❊❊❊

# మీ కొరకు గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు,తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

## Satya Vani

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. VM/KD/02/2009-2011**

**To**

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004